ప్రజాశక్తి

శుక్రవారం 8 ఆగస్టు 2025

5

అల్లూరి సీతారామరాజు

పథకాలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -అనంతగిరి: చిలకలగెడ్డ రైతు సేవ కేంద్రంలో పంచాయతీ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాల పై కాశిపట్నం పశువైద్యాధికారి ..ఎస్ గణేశ్వరరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా పశు సంపదను ఆర్థిక వనరుగా చేసుకొని పాడి పశువుల ద్వారా పాల ఉత్పత్తిని, గొర్రెలు మేకల ద్వారా మాంస ఉత్పత్తిని పెంపొందించుకోవాలన్నారు. పెరటి కోళ్ల ద్వారా గుడ్లను ఉత్పత్తి చేసే ఆర్థిక అభివృద్ధి సాధించ వచునన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డులతో నామమాత్రపు వడ్డీతో రైతులకు రుణాలు ఇచ్చే కార్యక్రమం ప్రభుత్వం చేపడుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లను రద్దు చేయాలి

-బాధిత గ్రామాల గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి:ఆదివాసీ తమ గిరిజనుల మనుగడను తీవ్ర నష్టాన్ని వాటిల్లే ఆదాని నవయుగ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశమునకు చిట్టంపాడు, గుజ్జలి, పెద్దకోట గ్రామాలకు చెందిన గిరిజనులు ఆందోళన చేపట్టారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు చేయాలని, ప్రభుత్వం మొండి వైఖరి నశించాలని పలు నినాదాలు చేస్తూ సభ ప్రాంగణంలోకి నిరసనకారులు దూసుకు వెళ్లారు. స్థానిక జడ్పిటిసి గంగరాజు, ఎంపీపీ నీలవేణికు సమస్యలపై విన్నవించారు. గిరిజన ప్రజా ప్రతినిధులు చేస్తూ నవయుగ హైడ్రోపవర్ ప్రాజెక్ట్ కు తాము పూర్తిగా వ్యతిరేకమన్నారు. తక్షణమే మండల బాడీలో తీర్మానం ఆమోదం అనంతరం ఆ నివేదిక ప్రభుత్వానికి అందజేయాలని అధికారులను కోరారు. మన్యం జిల్లాలో రద్దు చేసినట్టు ప్రకటించి అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో అనుమతులు యధావిధిగా కొనసాగించడం సరికాదన్నారు.గుమ్మకోట, గుజ్జులిలో రాత్రి సమయంలో డ్రోన్ లతో సర్వేలు నిర్వహించారన్నారు. గిరిజనులు అనేక పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి సీమకట్టినట్టు లేదని వారు మండిపడ్డారు ఇప్పటికైనా రద్దు చేయకుంటే గిరిజనులు తో కలిసి పోరాటానికి ఉద్రిక్తం చేస్తామని వారు హెచ్చరించారు అధికారులు ప్రజాప్రతినిధులు సహాయ సహకారాలతోనే మండల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పిటిసి గంగరాజు లు అన్నారు. గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండల పలు శాఖల అధికారులతో ముఖాముఖి సమావేశం జరిగింది ఆదవి తల్లి బాట పీఎం జన్మన్ పథకంలో భాగంగా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ సంబంధిత డిపార్ట్మెంట్ ఫారెస్ట్ అధికారుల అలసత్వంతో రోడ్డు నేటి వరకు పూర్తి కాలేదన్నారు. ప్రారంభించిన రోడ్డు సంవత్సరాలు గడిచినా అస్తవ్యస్తంగానే ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో. ప్రభాకరరావు, ఏటి డబ్ల్యూ వెంకటరమణ, ఎంఈఓ. బాలాజీ, కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా, డాక్టర్ గణేశ్వరరావు, జ్ఞానేశ్వరి, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు పాగి .అప్పారావు, కె.మొస్య దూరు, పేసా కమిటీ సభ్యులు ఆనంద్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

మండల సమావేశంలో నినాదాలు చేస్తున్న గిరిజనులు

మాట్లాడుతున్న జెడ్పిటిసి గంగరాజు

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు,: అల్లూరి జిల్లా పాడేరు మండలంలో ఈ నెల 9వ తేదీన శనివారం జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించనున్నారని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. అల్లూరి జిల్లా పాడేరు మండలం వంజంగి, లగిసపల్లి గ్రామాల్లో ఈనెల 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటిస్తున్నారు. ఈ పర్యటన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లలో భాగంగా వంజంగి గ్రామంలో జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, ఎమ్మెల్సీ బర్దర్ , జెసి అభిషేక్ గౌడ, సీఎం పర్యటన ఏర్పాటు కమిటీ ప్రతినిధులు, స్థానిక జీసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వంజంగి గ్రామ మహిళలతో గిరిజన సంప్రదాయాలు సంబంధించిన పండగలు ప్రదర్శన పై ఏ విధంగా చేయాలనే దానిపై చర్చించారు అనంతరం సమీపంలో ఉన్న ఓ నివాస గృహంలో హోమ్ స్టే పై పరిశీలించనున్నారు. తర్వాత కాఫీ తోటలు పరిశీలించి కాఫీ రైతులతో ముచ్చటించనున్నారు. అనంతరం లగిసపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని సభ వేదికలో కార్యకర్తలు తో సమావేశం నిర్వహిస్తారు. సీఎం పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, సహాయ కలెక్టర్ నిశాంత్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది ఉన్నారు.

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్

భాష, పర్యావరణంపై అవగాహన యాత్ర

ప్రజాశక్తి -సీలేరు: భాష, పర్యావరణంపై అవగాహన యాత్ర చేపడుతున్నామని నవీన్ , రాజ్‌కుమార్ వెల్లడించారు. గురువారం జికె వీధి మండలం సీలేరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేక రులతో మాట్లాడుతూ సమాజం పై అవగాహన పెంచుకోవడంతో పాటు ప్రాంతాలవారీగా మాట్లాడే భాషలను ఎలా ఎదుర్కోవాలి, పర్యావరణ పరిస్థితులపై అవగాహన ప్రాంతాలవారీగా జీవనశైలి తెలుసుకోవాలనే లక్ష్యంతో తిరుపతి జిల్లా నాగలాపురం మండలం ఎస్ పురానికి చెందిన నవీన్ దేశవ్యాప్త సైకిల్‌యాత్ర చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. తిరుపతిలోని ఎస్‌విఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశానని రోజుకు 100 కిలోమీటర్లు వెళ్తూ కొన్ని రాష్ట్రాలను ఎంపిక చేసుకుని తిరుపతి నుంచి నాగలాపూర్ మీదుగా యాత్ర మొదలు పెట్టామన్నారు. ముందుగా తమిళనాడు, కర్ణాటక, కేరళ, గోవా మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హర్యానా, పంజాబ్, జమ్మూకాశ్మీర్ ప్రాంతాల్లో యాత్ర చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో ముగించుకుని ఆంధ్రాలో అడుగుపెట్టామన్నారు. తెలంగాణకు చెందిన రాజ్‌కుమార్ పర్యావరణంపై అవగాహన పెంచుకునేందుకు యాత్ర చేపడుతున్నామన్నారు. సీలేరు మీదగా లంబసింగి అరకు వెళ్తామన్నారు.

సైకిల్‌యాత్ర చేస్తున్న యువకులు

విద్యుత్ ప్రమాద బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - రంపచోడవరం : విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ వలన ప్రాణాలు కోల్పోయిన గిరిజన కుటుంబాన్ని ఆదుకుంటామని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్మన్ శిరీషదేవి అన్నారు. మండలంలో నిమ్మలపాలెంలో ఇటీవల విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ప్రాణాలు కోల్పోయిన బలిజ గాయత్రి, బలిజ సాయిపల్లవి కుటుంబాలను ఆమె గురువారం పరామర్శించారు. ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబపెద్ద బలిజ వీరపురెడ్డిని ఓదార్చి రూ.10వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు. గ్రామంలో సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా తనను సంప్రదించాలని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంతమోహన్, కుంజం బాపన్నదొర, టిడిపి సీనియర్ నాయకులు అడబాల బాపిరాజు, మాజీ సీతపల్లి దేవస్థానం గుడి చైర్మన్ పండా బాబీ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి, శతశాతం రిజర్వేషన్లపై..

నేడు పాడేరు ఐటిడిఎ ఎదుట మహా ధర్నా

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్సిలోని షెడ్యూల్డ్ ఏరియా పోస్టులను మినహాయించి, వాటిని ఆదివాసి ప్రత్యేక డిఎస్‌సితో భర్తీ చేయాలని, తాము అధికారంలోకి వస్తే జిఒ.3 రిజర్వేషన్ కు ప్రత్యామ్నాయ జిఒ తీసుకు వస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ నిలబెట్టుకోవాలని, షెడ్యూల్డ్ ఏరియాలోని ఉద్యోగాలన్నీ ఆదివాసీలకే చెందేలా 100 శాతం రిజర్వేషన్ చట్టం చేయాలన్న డిమాండ్లతో ఆదివాసి నిరుద్యోగుల సంఘం, ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ ఈనెల 8న శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ కార్యాలయం గేటు ఎదుట మహా ధర్నా తలపెట్టింది. మహాధర్నాను విజయవంతం చేసేందుకు పాడేరు ఏజెన్సీలో ఆదివాసి యువగళం జీపు జాతతో విస్తత ప్రచారం చేపట్టింది. దీంతో ఈనెల 8న (శుక్రవారం) జరిగే మహా ధర్నా కార్యక్రమానికి పాడేరు ఏజెన్సీ నలుమూలల నుంచి ఆదివాసి యువత, నిరుద్యోగులు, విద్యార్థులు తరలిరానున్నారు. అరకులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే జిఒ.3కి ప్రత్యామ్నాయంగా మరో జిఒ తీసుకువస్తామని, ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న ఉద్యమాలకు ప్రభుత్వం స్పందించి గిరిజనులకే ఉద్యోగాలు కల్పిస్తామని గిరిజన శాఖ మంత్రి, ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో ప్రకటించినప్పటికీ అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందారు. జిఒ-3 రద్దు చేసిన క్రమంలో సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలను పాటిస్తూనే జిఒ.3 రిజర్వేషన్ పునరుద్ధరణకు ఉన్న అవకాశాలు, తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలు, సలహాలు, సూచనలు కోసం ప్రభుత్వం ఐటిడిఎల్లో జిఒ3పై వర్క్ షాప్‌లు నిర్వహించింది. ఆదివాసీ గిరిజన సంఘం, జెఎసి, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఆదివాసి మేధావులు 100శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందేనని ఆదివాసీలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. జిఒ.3 రిజర్వేషన్ కు ప్రత్యామ్నాయం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. 100 శాతం రిజర్వేషన్ కు ప్రభుత్వం చూపించే ప్రత్యామ్నాయనికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండేలా న్యాయపరమైన కసరత్తును ప్రభుత్వం పక్కాగా చేయాలని, పూర్తిస్థాయిలో చట్టబద్ధత కల్పించి ఆదివాసి స్పెషల్ డిఎస్సి నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో వివిధ ప్రజా, విద్యార్థి సంఘాలతో పాటు గిరిజన నిరుద్యోగులు మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మహా ధర్నా జయప్రదానికి విస్తృత ప్రచారం

-పాడేరులో ఆదివాసీ యువగళం జీపుజాతా

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా డిఎస్‌సిలోని ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులను మినహాయించి ఆదివాసి ప్రత్యేక డిఎస్‌సితో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 8న పాడేరు ఐటిడిఎ ఎదుట మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ నాయకులు ధర్మన పడాల్, కూడా రాధాకృష్ణ కోరారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకూ పాడేరు ఏజెన్సీ వ్యాప్తంగా తలపెట్టిన 'ఆదివాసీ యువగళం' జీపుజాతా గురువారం పాడేరు మండలంలో చేసుకుంది. 8న పాడేరులో మహా ధర్నాతో ముగియనుంది. మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ పాడేరు మండలంలోని ఆయా గ్రామాల్లో, పాడేరులో ప్రచారం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. జిఒ.3పై అరకులో ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ అమలు జాప్యంతో గిరిజనులు ఉద్యోగాలు కోల్పోతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసీల ఉద్యోగ రిజర్వేషన్ పై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోతే తీవ్ర ప్రతిఘటన తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాడేరులో తలపెట్టిన మహాధర్నా కార్యక్రమానికి ఆదివాసీలందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.ఆదివాసి నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ సాగని సత్యనారాయణ, భాను, సిహెచ్ రావు, సింహాద్రి, దాసు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న నాయకులు

హామీలపై సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలి

- వైసిపి మండల నాయకులు

ప్రజాశక్తి - జికె వీధి : ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసిలపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని వైసిపి మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపిపి కుమారి ఒక ప్రకటనలో కోరారు. జిఒ నంబర్ 3 పునరుద్దరణ, ఆదివాసి స్పెషల్ డిఎస్సి, 1/70 చట్టంపై స్పష్టమైన వైఖరి తెలియజేయాలన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజన సహకార సంస్థ డిపోలు శిథిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కొత్త భవనాలు మంజూరు చేయాలన్నారు. మండలకేంద్రంలో రోడ్ల విస్తరణ జరగకుండా టిడిపి నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. వైసిపి మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, అరుణ్, కంకిపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

'రాష్ట్రంలో రాక్షస పాలన'

ప్రజాశక్తి -విఆర్.పురం: రాష్ట్రంలో రాక్షసపాలన నడుస్తోందని జిల్లా వైసిపి బిసి సెల్ అధ్యక్షులు ఆవులమరియదాస్ ఆరోపించారు. కూనవరం మండలం ఎంపిపి పాయం రంగమ్మ అధ్యక్షతన కూనవరం, విఆర్‌పురం మండలాల నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మరియదాస్, విఆర్‌పురం మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఉపఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో జెడ్‌పిటిసిగా పోటీ చేసిన అభ్యర్థి ప్రచారానికి వెళ్లిన బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌యాదవ్, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల రమేష్ లపై టిడిపి గూండాలు దాడి చేయడం అమానుషమని ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర ప్రజలు మీ అరాచకాలు గమనిస్తున్నారని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు వైసిపి అభ్యర్థులను గెలిపించి టిడిపి నాయకులకు తగిన బుద్ధి చెపుతారన్నారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.కార్యక్రమంలో ఆర్టిఐ విభాగం అధ్యక్షులు బిసి సెల్ సీనియర్ నాయకులు బొడ్డు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ, చిన్న మట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, మండలం నాయకులు పీసా కమిటి అధ్యక్షులు కోటం జయరాజు కూనవరం సర్పంచ్ ఎంపిటిసిలు కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యర్థులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

టిడిపి మండల అధ్యక్ష పదవి ఎవరిని వరించేనో?

-బరిలో ఐదుగురు

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మారేడుమిల్లి మండల టిడిపి అధ్యక్ష పదవి కోసం ఐదుగురు సభ్యులు పోటీపడుతున్నారు. వారిలో గురుకు శేష్ కుమార్, ఇప్పటివరకు మండల అధ్యక్షునిగా ఉండి సేవలందించారు. బిసెట్టి అప్పాజీ గతంలో టిడిపి మండల అధ్యక్షునిగా చేశారు. షేక్ సుభాని మాజీ ఎంపిటిసి మరియు ఎయిమ్స్ డైరెక్టర్‌గా గతంలో పనిచేశారు. దూడ ప్రణీత్ టిఎన్‌ఎస్ఎఫ్ అధ్యక్షుడిగా ఉన్నారు. దూడ సువర్ణ కర్ణకుమార్, (డిఎస్ కె) మండల టిడిపి పార్టీ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే శిరీషదేవి, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్‌భాస్కర్ ఎదురుగుండా వీరు ఒకరితో ఒకరు వాగ్వాదానికి దిగారు. అధిష్టానం నిర్ణయం మేరకు పార్టీ ఎవరిని సూచిస్తే వారు పార్టీకి కట్టుబడి పనిచేయాల్సి ఉన్నా దానికి దీటుగా మారేడుమిల్లి మండలంలో ఐదుగురు పోటీలో ఉండడంపై గ్రామ కమిటీలు ఓటు వేయడంలో తర్జనభర్జన పడుతున్నారు. గ్రామకమిటీల ద్వారా అభిప్రాయ సేకరణ జరిపి అధ్యక్షున్ని నియమించాల్సి ఉండ గా ఈ అభిప్రాయ సేకరణ రెండో దశకు చేరుకుంది. అభిప్రాయ సేకరణ తర్వాత పార్టీ ఎవరిని నిర్ణయిస్తుందనే విషయమై అటు గ్రామ కమిటీలు ఇటు పోటీ చేసిన అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది.



అరకులోయలో నివాళి అర్పిస్తున్న నాయకులు

సూర్యనారాయణకు ఘన నివాళి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: కామ్రేడ్ ఎం సూర్యనారాయణ 11వ వర్ధంతిని అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సిపిఎం, సిఐటియు నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు జన్ని భగత్‌రామ్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో సంతలో మోసాలు, గిట్టుబాటు ధర, విద్యా, వైద్యం ఆదివాసులకు సంపూర్ణంగా అందించాలని అనేక ఉద్యమం చేశారని గుర్తు చేశారు. తన జీవితాన్ని త్యాగం చేసి గిరిజన ప్రాంతంలో అనేక పోరాటలు నిర్వహించాలన్నారు. అటవీ హక్కుల చట్టం పటిష్టంగా అమలు చేసి ప్రతి ఒక్కరికి పది ఎకరాలు తగ్గకుండా పోడు పట్టాలు పంపిణీ చేయాలని అనేక ఉద్యమాలు చేపట్టారని కొనియాడారు.కార్మికులతో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి తమ హక్కులను సాధించు కోవడంలో కీలక పాత్ర పోషించాలన్నారు.కామ్రేడ్ సూర్యనారాయణ స్పూర్తితో ప్రస్తుతం ఆదివాసుల పై జరుగుతున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఆదివాసులు, మేధావులు, కార్మిక, కర్షకులు ఐక్యం కావలసిన ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్ ఐసు బాబు, గిరిజన సంఘం మండల నాయకులు పాంగి రామన్న పాల్గొన్నారు.

హుకుంపేట:మండల కేంద్రంలో గురువారం ఆదివాసి మహిళా సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ సూర్యనారాయణ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, కార్మికులు, కర్షకుల హక్కుల కోసం కామ్రేడ్ సూర్యనారాయణ అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

బినామీ వ్యవస్థను అరికట్టాలి

ప్రజాశక్తి అరకులోయ రూరల్:అరకులోయ బినామీ వ్యవస్థను ఆపాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. గురువారం అరకులోయ మండల కేంద్రంలోని శరభగుడ కాలనీలోని ఆయన నివాస గృహంలో అరకులోయ తహశీల్దార్ అప్పారావు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అరకులోయ కేంద్రంగా బినామీ వ్యవస్థ రోజు రోజుకు పెరిగిపోతుందని బినామీ వ్యవస్థ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే ప్రజలకు రెవిన్యూ సేవలు సంపూర్ణంగా అందించేలా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోవింద్ ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గర్భిణులకు ఉచిత భోజనం

ప్రజాశక్తి -అనంతగిరి: మాతృభూమి సేవ సంఘం ఆధ్వర్యంలో గురువారం అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత భోజన కార్యక్రమం చేపట్టింది. సంస్థ మండల కోఆర్డినేటర్ డాక్టర్ బి.నగేష్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన 150 మంది గర్భిణులకు, ఆశా కార్యకర్తలకు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య అధికారిని జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు

- పలుచోట్ల ఆదివాసీ జెండా ఆవిష్కరణ
- విజయవంతం చేయాలని పిలుపు

దేవీపట్నం : మాట్లాడుతున్న తహశీల్దార్ సత్యనారాయణ

జికెవీధి: మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షులు కొండలరావు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల తొమ్మిదో తేదీన ప్రపంచ ఆదివాసి దినోత్సవం రంపచోడవరం సమీపంలోని వైటిసి ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గిరిజనులందరూ పాల్గొనాలని కోరారు.

విఆర్‌పురం: ములకలపల్లిలో 9న ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘ సీనియర్ నాయకులు నూనె దేశయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆదివాసీ జెండా ఆవిష్కరించారు. ములకలపల్లి సర్పంచ్ మారయ్య మాట్లాడుతూ కొయతోర్ పండూం దక్కడ్ కూనవరం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ ఆదివాసీ చట్టాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు సోయం చిన్నబాబు, బంగారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

దేవీపట్నం : ఇందుకూరుపేట స్త్రీ శక్తి భవనంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ కె.సత్యనారాయణ తెలిపారు. మండలంలో ఆదివాసీ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు ప్రజా సంఘాల నాయకులు అంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఎఒ వెంకటరావు తదితరులు మాట్లాడారు. ఎపి ఆదివాసీ జేఏసీ నాయకులు తెల్లం శేఖర్, కారం రామన్నదొర, కలుం సూర్య ప్రకాష్, మడి మురళి తదితరులు పాల్గొన్నారు.

జికె వీధి :మండలం కేంద్రంలో టిడిపి జిల్లా ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు పోత్తూరు కొండలరావు ఆధ్వర్యంలో స్థానిక కళ్యాణ మండపం వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పొత్తురు కొండలరావు మాట్లాడుతూ 9వ తేదీన ఆదివాసీ దినోత్సవానికి పాడేరు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు జీకే వీధి మండల టిడిపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలకాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మాజీ అధ్యక్షులు కొర్ర బలరాం, ముక్కల మహేష్, వండలం బాలయ్య, వడేల పాండురాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు దేశగిరి గోవిందరావు పాల్గొన్నారు.

కూనవరం:స్థానిక టేకులబోరు ఆదివాసి టీచర్స్ అసోసియేషన్‌కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సరియం అనిల్ కుమార్ మాట్లాడుతూ 9వ తేదీన మండలంలోని ప్రతి గ్రామంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని జెండా ఆవిష్కరించాలన్నారు. టేకులబోరు నందు ముందుగా జెండా ఎగరవేసి అనంతరం జగ్గవరం క్రాస్‌రోడ్ వద్దకు ఉపాధ్యాయులంతా తరలిరావాలని రెవెల్‌గూడెం, కోతులుగుట్ట, విఆర్‌పురం తరలివెళ్లాలని సూచించారు. జిల్లా సహాయ అధ్యక్షులు కట్టం వీరయ్య, మండల అధ్యక్షుడు జితేంద్ర, ఎటిఎ ఉపాధ్యాయులు కుంజా జితేంద్ర, కారం సత్యనారాయణదొర, కొమరం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇళ్లలోకి మురుగునీరు

ప్రజాశక్తి - జికెవీధి : మండలంలోని రింతాడ కాలనీ సమీపంలోని డ్రైనేజీ లేని కారణం చేత భారీవర్షాలకు ఇళ్లలోకి మురుగునీరు చేరుతోంది. డ్రైనేజీ నిర్మించాలని పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు జర్త సత్తిబాబు, చేదల దారాల మ్మ, రావణ్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించేందుకు చర్యలు కోరుతున్నారు.

మురుగునీటితో నిండిన వీధి

నిరుపయోగంగా జనరేటర్, కంటైనర్

ప్రజాశక్తి - చింతూరు: మండలంలోని చట్టి పంచాయతీ జాతీయ రహదారి జంక్షన్ వద్ద గతంలో కమర్షియల్ చెక్‌పోస్టుకు చెందిన కంటైనర్, రూ.4లక్షల వ్యయంతో జనరేటర్ అక్కడ ఏర్పాటు చేశారు. జిఎస్టి విధానం వచ్చిన తర్వాత కమర్షియల్ టాక్స్ చెక్‌పోస్టులను ప్రభుత్వం రద్దు చేసింది. గత మూడు సంవత్సరాలుగా లక్షల విలువైన కంటైనర్, జనరేటర్ నిరపయోగంగా పడిఉన్నాయి. జనరేటర్‌కు సంబంధించిన కొంత సామగ్రి కూడా చోరీకి గురైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్థానిక అధికారులు ప్రభుత్వం దృష్టికి జనరేటర్, కంటైనర్ లను వినియోగం లోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

మూలన పడి ఉన్న జనరేటర్

తాగునీటి సమస్యపై వినతి

ఎంపిడిఒకు వినతిపత్రాన్ని ఇస్తున్న మహిళలు

ప్రజాశక్తి- హుకుంపేట: పంచాయతీ పరిధిలోని సిపిఎం కాలనీ, మోదమాంబ కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆదివాసి గిరిజన మహిళా సంఘం, ఐద్వా సంస్థల ప్రతినిధులు గురువారం ఎంపీడీవోను కలసి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సంఘం కార్యదర్శి ఎస్. హైమావతి మాట్లాడుతూ, రెండు కాలనీల వాసులు తాగునీటి సమస్యతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ఎన్నిసార్లు అధికారులను కోరినప్పటికీ, ఇప్పటివరకు సమస్యకు పరిష్కారం దొరకలేదని విమర్శించారు. 'జల జీవన్ మిషన్" పేరుతో ఇంటింటికి మంచినీరు అందిస్తున్నామని అధికారుల ప్రకటనలు కేవలం పేపర్లకే పరిమితమయ్యాయని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే ఖాళీ బిందెలతో ఎంపీడీవో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు కే.అరుణ, నీలమ్మ, అన్నపూర్ణ, రవణమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

12న డీవార్మింగ్ డే

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : ఈ నెల 12వ తేదీన జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. గురువారం లగిసిపల్లి గ్రామంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పోస్టర్లను జిల్లా కలెక్టరు విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అన్ని విద్యాసంస్థలకు మందుల పంపిణీ జరగాలని సూచించారు. రక్తహీనత నివారణకు నులిపురుగులు నివారణ ఆవశ్యకత ఉందని గుర్తించాలన్నారు. నులి పురుగులంఎ రక్త హీనత, పోషకాల లోపం, ఆకలి మందగించటం, నీరసం, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని ఆయన చెప్పారు. ఆల్ బెండజోల్ మాత్ర వేయడం ద్వారా రక్త హీనత నివారణ, పోషకాలు గ్రహించడం జరుగుతుందని తద్వారా ఏకాగ్రత పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అమిత్ బర్దార్ , జెసి అభిషేక్ గౌడ, అదనపు ఎస్ పి ధీరజ్ తదితరులు ఉన్నారు.

బాబూరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో బొంగరం పంచాయతీ ఉప సర్పంచ్ బుడేదే బాబూరావు గుండెపోటులో మృతి చెందగా, ఆ పార్టీ నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాబూరావు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే రేగం మత్యలింగం ఆదేశాల మేరకు వైసిపి యువజన విభాగం ఉపాధ్యక్షుడు రేగం చాణక్య, వైసిపి మండల అధ్యక్షులు మజ్జి చంద్రుబాబు బొంగరం పంచాయతీ వంచుర్బా గ్రామానికి వెళ్లి బాబూరావు కుటుంబాన్ని పరామర్శించి మృతహానికి నివాళులర్పించారు. దహన ఖర్చుల నిమిత్తం అరకు ఎమ్మెల్యే తరుపున రూ. 10వేలు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సందడి కొండబాబు, లింగేటి చంటిబాబు, ఆపన్న రామన్న, శ్రీను, నాగంనాయుడు, మూర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక డిఎస్‌సిపై ప్రకటన చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

మాట్లాడుతున్న సురేంద్ర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: స్థానిక డిగ్రీ కళాశాలలో గురువారం ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం వ్యాసరచనలు పోటీల విజేతలకు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, కళాశాల ఎన్ఎస్ఎస్, పిఓ నాగబాబు, విజయలక్ష్మి అధ్యాపకులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించే ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ పాడేరులో ఆగస్టు 9న జరగనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవానికి హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏజెన్సీలో వందశాతం ఉద్యోగ నియామక చట్టంపై, మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ పోస్టులు మినహాయింపు, ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల పై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.పాడేరు ఏజెన్సీలో పెదకోట, గుజ్జెలి,చిట్టంపాడు హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జి.బుజ్జిబాబు, ఎస్ఎఫ్ఐ, నాయకులు కె రామరావు, పి.రామన్న, ఐసు బాబు, జన్ని భగత్ రామ్, కళాశాల అధ్యాపకులు కెసునీల్ కుమార్, లచ్చన్న, అనిత కుమారి,తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ వారోత్సవాలు

చింతపల్లి : ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పినకొత్తూరు గ్రామంలో గిరిజన సంఘం జెండాను గురువారం ఆవిష్కరించారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాల్లో 100శాతం రిజర్వేషన్ ఆదివాసీలకు కల్పించే దిశగా ప్రత్యేక జీవోను ప్రకటించాలని కోరారు. గతంలో సుప్రీంకోర్టు రద్దు చేసిన జీవో నంబర్3 స్థానంలో, 100శాతం రిజర్వేషన్ చట్టాన్ని తీసుకువచ్చి, దానిని రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో కేవలం 6శాతం రిజర్వేషన్ ఇవ్వడం వల్ల ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఐటీడీఏల పరిధిలో మొత్తం 766 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే, ఆదివాసీలకు దక్కేది కేవలం 42 పోస్టులేనని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 94శాతం నివాసం ఉన్న ఆదివాసీలకు 6శాతంపోస్టులు, 6శాతం నివాసం ఉన్న గిరిజనేతరులకు 94శాతం పోస్టులు దక్కడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల హామీ ప్రకారం ఏజెన్సీలో 100శాతం ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకోవాలని, మెగా డీఎస్సీ నుండి ఆదివాసీ ప్రాంత పోస్టులను మినహాయించి, ఏజెన్సీ షెడ్యూల్ డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గెమ్మెల లక్ష్మయ్య, సీదేరి మల్లేశ్వరరావు, చిన్నారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : మండలంలోని బంగారు మెట్ట పంచాయతీ మాలగుమ్మి గ్రామం లో ఆదివాసి గిరిజన సంఘం నేత శ్రీను ఆధ్వర్యంలో ప్రపంచం ఆదివాసీ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి కె నర్సయ్య జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆదివాసులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ తక్షణమే అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి ఆదివాసీ డిఎస్సీ పై స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వి చందు, దేవన్న, ధర్మరాజు పాల్గొన్నారు.

చెత్త సేకరణ రిక్షా ప్రారంభం

చెత్త సేకరణ రిక్షా ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని బెన్నవరం పంచాయతీలో చెత్త సేకరణ రిక్షా వాహనాన్ని సర్పంచ్ బచ్చల సన్యాసమ్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విజయవంతంగా అమలు చేయాలన్నారు. అందులో భాగంగా చెత్త తరలింపునకు రిక్షా వాహనాన్ని పారిశుధ్య కార్మికులకు అందజేసినట్టు తెలిపారు. ప్రతి ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంటే గ్రామమంతా ఆరోగ్యవంతంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు పూజారి నారాయణమూర్తి, మరిగల చంటి బాబు, పూజారి నాగేశ్వరరావు, ముర్లు త్రినాథ్, గేమ్మెల దన్ను, బురిడీ భాస్కరరావు, జర్త రాజేంద్ర, ముువ్వల సత్తిబాబు, ముువ్వల నాగేశ్వరరావు, డిప్పల రాజు, సతీష్, బిజెపి కార్యకర్త ఉల్లి రమణ పాల్గొన్నారు.

కాలేజీలో సమస్యలను పరిష్కరించాలి

మాట్లాడుతున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రపంచ ఆదివాసీ వార్సోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాలలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పాడుతున్నారన్నారు. 450 మంది కళాశాలలో ఉంటే విద్యార్థినిలకు హాస్టల్ సౌకర్యం లేక గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉండే పరిస్థితి ఏర్పడింధని చెప్పారు. అదనపు భవనాలు, మరుగుదొడ్లు సరిపడే లేక కళాశాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణ, బి కోటిబాబు, పి డొంబు, పి మోహన్ దాస్, కె రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

- గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి: మండల కేంద్రం అనంతగిరి పంచాయతీ పరిధి పెద్దూరు, మాలింగ వలస మీదుగా పాతకోట, రేగం, నందిగుమ్మి, మద్దిగరువు, పెద్దబాయలు మెయిన్ రోడ్, తెల్లారుపాడు గ్రామాలకు తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల గిరిజనులు గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక సర్పంచ్ సోమేల.రూతు చేతుల మీదుగా ఎంపీపీ నీలవేణి, జడ్పిటిసి గంగరాజు, ఎంపీడీవోలకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రూతు, గిరిజన సంఘం నాయకులు సిఎస్. సింహాద్రి, సుబ్బారావులు మాట్లాడుతూ, గ్రామాలకు రోడ్డు సౌకర్యం మెరుగు పరిచేందుకు గత ప్రభుత్వం కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్య కారణంగానే పనులు ఎక్కడి కక్కడ నిలిచిపోయాయని తెలిపారు.కూటమి ప్రభుత్వం తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేసి తమ కష్టాలను తీర్చాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు పాతకోట గ్రామంలో ఏకలవ్య పాఠశాల నిర్మాణం జరుగుతుందని మెటీరియల్ తరలించడానికి ఇబ్బందికరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎస్. ధర్మనాయుడు, కొండన్న, దేవన్న తదితరులు పాల్గొన్నారు

రైతులకు మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట: పర్యావరణ పరిరక్షణతో పాటు గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి మొక్కల పెంపకం దోహదపడుతుందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ లింగమూర్తి తెలిపారు. గురువారం మఠం పంచాయతీలో బీజేవైఎం అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్య కొండబాబుతో కలిసి గిరిజన రైతులకు మొక్కలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 52 మంది గిరిజన రైతులకు 23,400 సిల్వర్ ఓక్ మొక్కలు, 13,104 మహాగని మొక్కలు ఉచితంగా అందించామన్నారు.ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ జోగారావు, వీఆర్పీలు అల్లంగి బాలయ్య, కోటరీ మత్యలింగం, మేట్లు రేగం కృష్ణారావు, జన్ని కామరాజు, పిసా కమిటీ సభ్యుడు మామిడి కనకరావు పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి: హుకుంపేట: మండల కేంద్రంలోని సిపిఎం కాలనీ వద్ద గండేరు కోటి నివాసంలో గురువారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం సంభవించింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో టీవీ, బీరువా, బట్టలు, ఇతర గృహోపయోగ సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి.స్థానిక మహిళలు నీళ్ల పోసి మంటలను అదుపు చేశారు.

'ప్రేరణ' తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

అవగాహన కల్పిస్తున్న ఉదయ్ కుమార్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ప్రేరణ తరగతులు సద్వినియోగం చేసుకొని పదో తరగతిలో మార్కులతో లైఫ్ కోచ్ హెచ్ఆర్డి ట్రైనర్ డాక్టర్ ఉదయ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. అరకులోయ మండల కేంద్రంలోని శారదా నికేతన్ పాఠశాలలో శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథి ఉదయ్ కుమార్ పాల్గొని బోధించారు.పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని క్రమశిక్షణతో చదువుకోవాలని తెలిపారు.అన్ని సబ్జెక్టులపై అవగాహన చేసుకొని ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిరంజీవులు, ఐద్వా జిల్లా కార్యదర్శి వి విజయ, స్కూల్ కమిటీ సభ్యులు సిహెచ్ సుమిత్ర, పాఠశాల ఉపాధ్యాయులు, విజయ్ కుమార్, కె కుమారి, ఎ కుమారి, డి ధనలక్ష్మి, ఎస్ మహేష్, ప్రకాష్ , వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటాం

హామీలు అమలు చేశాకే అడుగు పెట్టాలి
ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు విశ్వేశ్వర రాజు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆదివాసీల అడ్డా కొచ్చే అర్హత లేదని ఆయన పర్యటనను వైఎస్ఆర్సిపి అడ్డుకుంటుందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఈ నెల 9వ తేదీన పాడేరు జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఖరారు కావడంపై ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం పై ఘాటు విమర్శలు చేశారు. అధికారంలోకి వచ్చాక ఆదివాసీలను ఏం ఉద్ధరించారని? ఏం మొహం పెట్టుకొని పాడేరులో ఆదివాసి దినోత్సవానికి వస్తున్నారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. ఆదివాసీల సంక్షేమం పట్ల సీఎంకు చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాకే మన్యంలో అడుగు పెట్టాలని ఆయన వ్యాఖ్యానించారు. 2024లో ఎన్నికల ప్రచారానికి వచ్చి అరకు వేదికగా వేలాది మంది గిరిజనుల సాక్షిగా బహిరంగంగా సభలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీవో 3 పునరుద్ధరణ చేస్తామని లేదా ప్రత్యామ్నాయ జీవో తీసుకొస్తామని , స్పెషల్ డిఎస్సీ భర్తీ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన ఏ ఒక్క హామీను కూడా అమలు చేయకుండా గిరిజన సమాజాన్ని గిరిజన నిరుద్యోగ యువతను నిలువునా మోసం చేశారన్నారు. ఈ నెల 9న గిరిజన ప్రాంతంలో పర్యటించే ముందు జీవో 3పై, 1/70 చట్టం అమలుపై స్పష్టమైన ప్రకటన చేసిన తరువాత ఈ ఆదివాసీ ప్రాంతంలో అడుగుపెట్టాలని లేని పక్షంలో ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఇంటింటికి రేషన్ డెలివరీ చేసి అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటికి రేషన్ వ్యవస్థను రద్దు చేసి కష్టాలను తెచ్చిపెట్టిందన్నారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటింటికి రేషన్ సరుకులు అందడం లేదన్నారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మండల ఉపాధ్యక్షులు వణుగు బసవన్న దొర, మండల ప్రధాన కార్యదర్శి వంతల రాంబాబు, లకే రామ సత్యవతి, వంతల నరేష్, వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సర్వ సూర్యనారాయణ, నియోజకవర్గ మహిళావిభాగం అధ్యక్షురాలు కిలో ఊర్వశిరాణి, గుత్తులపుట్టు ఎంపీటీసీ సభ్యుడు దూసూరి సన్యాసిరావు, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు గుల్లెల లింగమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు తమర్బ వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, తమర్బ బాబుల్‌నాయుడు, రాజేష్ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీలకు
టెక్నికల్ మ్యాచ్ అఫీషియల్‌గా శర్మ

డి.వి.ఎస్.వై.శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ఆగస్టు 6 నుండి 15 వరకు వియన్న లావోస్ లో జరుగుతున్న వరల్డ్ టేబుల్ టెన్నిస్ యూత్ కాంటెండర్, వరల్డ్ టేబుల్ టెన్నిస్ ఫీడెర్ 2025 పోటీలకు టెక్నికల్ మ్యాచ్ అఫీషియల్‌గా విశాఖపట్నంకు చెందిన డాక్టర్ డి.వి.ఎస్.వై.శర్మ హాజరయ్యారు . మొత్తం 35 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్న ఈ పోటీల్లో భారత్ నుండి బ్లూ బ్యాడ్జి ఎంపైర్ హోదాలో ఎంపికైన ఏకైక వ్యక్తిగా శర్మ నిలిచారు. ఆయన ప్రస్తుతం విశాఖపట్నంలోని ఎల్ఐసి స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు మెంబర్‌గా పనిచేస్తూ విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శిగా, రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

- కబడ్డీ, టగ్‌ఆఫ్‌వార్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

ద్వితీయ స్థానంలో నిలిచిన సీలేరు జట్టు

పల్నాడు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న చీఫ్ ఇంజనీర్

టగ్‌ఆఫ్ వార్‌లో విజేత అయిన తిరుపతి జట్టు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం అప్పరు సీలేరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యుత్ ఉద్యోగుల కబడ్డీ పోటీల్లో పల్నాడు జట్టు విజయం సాధించింది. విద్యుత్తు ఉద్యోగుల కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలను మూడురోజుల పాటు నిర్వహించారు. కబడ్డీలో సెమీఫైనల్‌కు సీలేరు, పల్నాడు, నెల్లూరు తిరుపతి జట్లు చేరుకున్నాయి. గురువారం జరిగిన సెమీఫైనల్‌లో నెల్లూరు జట్టుపై పల్నాడు జట్టు విజయం సాధించి ఫైనల్‌కి చేరుకుంది. ఫైనల్లో సీలేరు- పల్నాడు జట్లు కబడ్డీలో తలపడ్డాయి. పల్నాడు 35 పాయింట్లు సాధించి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. సీలేరు జట్టు 21 స్కోరు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. నెల్లూరు జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. టగ్ ఆఫ్ వార్ పోటీల్లో తిరుపతి ప్రథమస్థానంలో నిలవగా ద్వితీయ స్థానంలో ఎన్‌టిపిఎస్, తృతీయ స్థానంలో ఏలూరు నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీలేరు కాంప్లెక్స్ చీఫ్‌ఇంజనీర్ రాజారావు, అతిథులుగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాలకృష్ణ రాజేంద్రప్రసాద్, వరప్రసాద్, నాగ శ్రీనివాసరావు, జి.భాస్కరరావు హాజరయ్యారు. చీఫ్ ఇంజనీర్ రాజారావు మాట్లాడుతూ ప్రతి ఏటా సీలేరులో ఏదో ఒక క్రీడను నిర్వహించే విధంగా స్పోర్ట్స్ కౌన్సిల్ చర్యలు తీసుకోవాలని కోరారు. క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పించే విధంగా కృషి చేయాలని స్పోర్ట్స్ కౌన్సిల్ మేనేజర్ వరి వేలు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన సానుకూలంగా స్పందించి యాజమాన్యంతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీలేరు ఏపీ జెన్కో ఆధ్వర్యంలో నడుస్తున్న జిమ్ మరమ్మతులకు గురైందని జిమ్మును వినియోగంలో తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని స్పోర్ట్స్ అధికారిని చీఫ్ ఇంజనీర్ రాజారావు కోరారు. విజేతలకు ఆయన ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్ సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ ఎపి జెన్కో డిఇఇ శ్రీనివాసరావు స్పోర్ట్స్ సెక్రటరీ నాగేష్ ట్రెజరర్ కింసా లామ, ఆర్గనైజర్ ఎపి జెన్కో పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఏ ఇ సురేష్ ఏడిఈ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

అడ్డతీగలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న వైద్యులు

ముంచంగిపుట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

ప్రజాశక్తి -అడ్డతీగల: స్థానిక మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం గురువారం ముగిసినట్టు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పండ సతీష్ తెలిపారు. డాక్టర్ షేక్ మస్తాన్ పీడియాట్రిషన్ డాక్టర్ శ్రీ హర్ష ఉన్నారు. తల్లి పాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తల్లిపాలు బిడ్డలకు ఇవ్వాలన్నారు. తల్లిపాలు ఇచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను హాస్పిటల్ కౌన్సిలర్ వాసు వివరించారు. కార్యక్రమంలో అనస్థిషియా డాక్టర్ రచన, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు: తల్లిపాల వారోత్సవం ముగింపు కార్యక్రమం సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ పుల్లయ్య డిప్యూటి డిఎంహెచ్ఒ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పిల్లల వైద్యుడు మహేష్ ఎస్ఎన్‌సియూ మెడికల్ ఆఫీసర్ తల్లిపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం తల్లిపాలు వారోత్సవాలను సిడిపిఓ సిహెచ్ బాలాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కిషోర్, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలోనీ ఐసిడిఎస్ కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు తల్లిపాల ప్రాముఖ్యతపై ఐసిడిఎస్ ఇన్చార్జి సిడిపిఓ ఎస్.రాజేశ్వరి ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. సూపర్వైజర్లు వరహాలమ్మ, ఎస్ కొండమ్మ, సిహెచ్ స్వర్ణ, వెలుగు ఎపిఎం సిహెచ్ కళావతి పాల్గొన్నారు.

ఎంఇఒ కార్యాలయంలో సీమంతాలు నిర్వహించిన దృశ్యం

ఘనంగా సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి-అడ్డతీగల: స్థానిక మండల కేంద్రం ఎంఈఓ కార్యాలయంలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. అడ్డతీగల సెక్టార్‌లో తల్లిపాల వారోత్సవాలు అన్నప్రాసన కార్యక్రమం కూడా నిర్వహించారు. బిడ్డలకు పాలు ఇవ్వడంపై దానివల్ల బిడ్డలకు కలిగే ఆరోగ్యప్రయోజనాలపై అవగాహన కల్పించినట్టు డాక్టర్, సిడిపిఒ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై అప్పలసూరి

మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు

ప్రజాశక్తి- జికె వీధి : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం వద్ద గురువారం ఎస్ఐ అప్పలసూరి గ్రామప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ ద్వారా జరుగుతున్న మోసాలు, ఫోన్‌కాల్స్ ద్వారా జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికైనా తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఒటిపిలు చెప్పరాదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మోటార్ వెహికల్ చట్ట నిబంధనల గురించి వివరించారు. మత్తు పదార్థాలు రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎపిఒ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఫోల్డబుల్స్ ఫోన్లకు విశేష ఆదరణ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ సామ్‌సంగ్ నూతన ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లు గెలాక్సీ జెడ్ ఫోల్డ్7, జెడ్ ఫ్లిప్7 జెడ్ ఫ్లిప్7 ఎఫ్ఈ అపూర్వమైన ఆదరణను పొందాయని సామ్‌సంగ్ రీజనల్ హెడ్ ప్రతినిధి జెబి పార్క్ అన్నారు. గురువారం విశాఖపట్నంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూలై 9న ఈ ఫోన్‌లను విడుదల చేసిన తరువాత మొదటి 48 గంటల్లోనే గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 7, జెడ్ ఫ్లిప్7 జెడ్ ఫ్లిప్7 ఎఫ్ఈ కోసం 2.1 లక్షలకు పైగా ప్రీఆర్డర్‌లను సామ్‌సంగ్ అందుకుందన్నారు. ఈ నేపథ్యంలో, సామ్‌సంగ్ యొక్క భవిష్యత్తులో అమ్మకాల్లో విశాఖపట్నం ఒక కీలకమైన మార్కెట్ అన్నారు.

19న ఫొటో జర్నలిస్టుల ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 19, 20వ తేదీల్లో నిర్వహించే ఫొటో ఎగ్జిబిషన్ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ గురువారం ఆవిష్కరించారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో వైజాగ్ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు వై.రామకృష్ణ, కార్యదర్శి ఎండి.నవాజ్‌తో కార్యక్రమంలో పాల్గొన్నారు. 19వతేదీ ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఫొటోగ్రాఫర్లు కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌కు సందర్శకులు పాల్గొంటున్నందున అందుకు తగిన విధంగా విశాఖ పూర్వ ఫోటోలు, సందేశాత్మకంగా, ఆకర్షణీయంగా, వాస్తవానికి దగ్గరగా ఉన్న ఫోటోలను ప్రదర్శించాలని ఫొటోగ్రాఫర్లకు కమిషనర్ సూచించారు.